క్లుప్తంగా

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



పెబ్బేరు రూరల్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాష్ట్రీయ బాల స్వస్థ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించారు. అంతేకాకుండా కంటి చూపు కాపాడుకునేందుకు అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి, అంజలి, ఉషప్రియ, మహేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



కొత్తకోట: శివ మాలధారులు మండల దీక్ష కాలంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలని పట్టణంలో దాతల సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన జయసింహ రూ.5,116లు నిత్యాన్నదానానికి విరాళం అందజేశారు. కార్యక్రమంలో గురుస్వాములు శాంతిరెడ్డి, శ్రీనివాస్, మన్యం, నరసింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాగరాజు కురుమూర్తి తదితరులు ఉన్నారు.

ఇరుముడితో..

మదనాపురం: మండల దీక్ష చేపట్టిన శివ మాలధారులు బుధవారం ఇరుముడి కట్టుకొని పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఆంజనేయస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులు, బంధువులు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేశారు.

యూరియా నిల్వల పరిశీలన



పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో, ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా నిల్వలను బుధవారం ఏఓ రాజవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో కార్యాలయంలో 800 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా మూడు లారీల యూరియా వస్తుందన్నారు. ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు యూరియా అందించేందుకు ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి



కొత్తకోట: యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని దేవరకద్ర అసెంబ్లీ కో కన్వీనర్ కొమ్ము భరత్‌భూషణ్ అన్నారు. బుధవారం పట్టణంలో కొత్తకోట ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో ఆరో రోజు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో యువత ముందుండాలని, క్రీడలతో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేపీఎల్ నిర్వాహకులు నవీన్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, గుంత శివ, రఘు, కార్తీక్, సాయి, సన్నీ, మహేష్, శివశంకర్, తరుణ్, గణేష్, అరుణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వనపర్తి రూరల్: బైక్‌పై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి సూచించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం మండలంలోని కడుకుంట్లలో నవ భారత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, డ్రగ్స్. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యంగా ఉండే వారు 6 నెలలకు ఒకసారి రక్తం దానం చేయాలని కోరారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కి సంప్రదించాలన్నారు.

పచ్చదనం పెంపు సాధ్యమేనా?

- గతేడాది కంటే పెరిగిన లక్ష్యం
- షేడ్ నెట్లు లేని నర్సరీలు



పాన్‌గల్‌లో గ్రీన్‌నెట్ ఏర్పాటు చేయని నర్సరీ

పాన్‌గల్: అడవుల శాతం, పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం ఏటా వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తోంది. దీనికి అవసరమైన మొక్కలు పెంచేందుకు గ్రామానికో నర్సరీ ఏర్పాటు చేసింది. ఎండల తీవ్రత దృష్ట్యా మొక్కలకు రక్షణ కల్పించేందుకు గ్రీన్‌షెడ్ నెట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టక పోవడంతో మొక్కల ఎదుగుదల ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా అంతర్గత రహదారులతో పాటు ప్రభుత్వ భవనాల సముదాయాల ఆవరణలో మొక్కలు నాటుతున్నారు. వీటితో పాటు ఇళ్లలో పెంచుకునే మొక్కలను ప్రజలకు అందిస్తున్నారు. గ్రామాల్లోని నర్సరీలలో మొక్కలు సిద్ధం చేస్తుండగా.. గతేడాది కంటే ఈ సారి మొక్కల సంఖ్యను పెంచారు. ఇప్పటికే నర్సరీల్లో నాటిన విత్తనాలు మొలకెత్తుతున్నాయి. దీంతో వానాకాలం ప్రారంభానికి ముందుగానే గుంతలు తవ్వడం పూర్తి చేయించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు.

మండల పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో వన నర్సరీలు ఏర్పాటు చేశారు. ఆయా జీపీల్లో గతేడాది 1.24 లక్షల మొక్కలు నిర్దేశించగా ఈ సంవత్సరం లక్ష్యం పెంచి 1.26 లక్షలుగా నిర్ణయించారు. జనాభా ఆధారంగా జీపీల్లో 2 వేల నుంచి 3 వేల మొక్కలు, పెద్ద జీపీల్లో 6 వేల నుంచి 8 వేల లక్ష్యాన్ని నిర్దేంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

✦ ఆయా జీపీల్లో గీత కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా 16 వేల ఈత మొక్కలు నాటాలన్నారు.

✦ మండలంలోని ఆయా జీపీల్లో నీడనిచ్చే, పండ్ల మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నారు. పండ్ల మొక్కల్లో జామ, దానిమ్మ, బొప్పాయి, నేరేడు, గంగిరేయి వంటి మొక్కలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో పాటు ఫారెస్టు మొక్కలైన బహుమియా, కానుగ, రెయిన్‌ట్రీ, తంగెడి వంటి పది రకాల మొక్కలు నాటనున్నట్లు అధికారులు తెలిపారు.

పండ్ల మొక్కలు అందించాలి



గ్రామాల్లో ఇంటింటికీ పూల, పండ్ల మొక్కలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. గతంలో పంపిణీ చేసిన మొక్కలు చెట్లుగా మారాయి. ఆసక్తి ఉన్న వారికి పండ్ల మొక్కలు అందించాలి. మొక్కల పెంపకం, సంరక్షణపై గ్రామాల్లో ప్రజలు, రైతులకు అవగాహన పెంచాలి.

– లింగాల రాములు, రైతు, పాన్‌గల్

గ్రీన్‌నెట్ ఏర్పాటు..



ఎండల తీవ్రత దృష్ట్యా మొక్కలకు నీడ కోసం గ్రీన్‌షెడ్ నెట్ ఏర్పాటు చేయాలి. మండలంలోని చాలా గ్రామాల నర్సరీల్లో నీడ లేకపోవడంతో మొక్కలు ఎండుమొఖం పడుతున్నాయి. దీంతో పాటు ప్రభుత్వ ఖాళీ స్థలాలు, కార్యాలయం ఆవరణల్లో విరివిగా మొక్కలు నాటేందుకు తగు చర్యలు తీసుకోవాలి.

– బాల్యనాయక్, తెల్లరాళ్లపల్లితండా

మొక్కల సంరక్షణకు చర్యలు



గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల సంరక్షణకు అవసరమైన సిబ్బంది నియమించి, వారికి తగు సూచనలు చేశాం. ఎండ తీవ్రత నుంచి మొక్కల ను కాపాడేందుకు గ్రీన్‌షెడ్ నెట్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. లక్ష్యం మేరకు మొక్కలు నాటే విధంగా కృషి చేస్తున్నాం. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

'కేంద్ర బడ్జెట్‌ను పునః సమీక్షించాలి'



జిల్లాకేంద్రంలో నిరసన తెలుపుతున్న నాయకులు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలంటూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ తెలంగాణకు ద్రోహం చేస్తూ కార్పొరేట్లకు భోజ్యం అందించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. పేదలను విస్మరించి సంపన్న వర్గాలకే పెద్దపీట వేశారని ఆరోపించారు. పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో రైతులకు అందిస్తున్న సబ్సిడీలను ఎత్తివేస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతుందన్నారు. కార్యక్రమంలో జీఎస్ గోపి, వెంకటేష్, రమేష్, రాజన్న, ప్రసాద్, సామేల్, భాస్కర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: వ్యవసాయ కూలీలు, రైతులకు ఉపయోగపడని బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, తిరిగి సవరించాలని వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మండ్ల రాజు, లక్ష్మి, పరమేశ్వరాచారి, సీపీఐ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలకృష్ణ, రమేష్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కురుమయ్య, మదన్, బాలస్వామి, బీసన్న, ఉమ, సాయిలీల, నందిమళ్ల రాములు, మన్యం, రత్నయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్ బడ్జెట్..

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా పేద, మధ్య తరగతి ప్రజలకు నష్టం చేకూర్చే విధంగా ఉందని వామపక్షాల పార్టీల నాయకులు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక గాంధీచౌక్‌లో సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రాజు, మోష, రాబర్ట్, శ్రీహరి, ప్రసాద్, సామేలు, లక్ష్మీనారాయణశెట్టి తదితరులు ఉన్నారు.

మదనాపురం: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, వ్యవసాయ కూలీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆర్థిక మంత్రి మరోమారు బడ్జెట్‌ను పునఃసమీక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐఎం నాయకులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా.. రైతులు, కూలీలు, పేదలకు వ్యతిరేకంగా ఉందని దుయ్యబట్టారు. ఉపాధి హామీ చట్టానికి కేవలం రూ. 86 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, దేశంలో 40 శాతం ఉన్న వ్యవసాయ కూలీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో సవరణలు చేయకుంటే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చిరంజీవి, మనివర్ధన్, మొగిలి, బీమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ డిజిటల్ బుక్స్ పంపిణీ

మదనాపురం: మండలంలోని కొన్నూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి తన సొంత డబ్బులతో సమకూర్చిన మోడల్ డిజిటల్ బుక్కులను మాజీ ఎంపీటీసీ శరత్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు భాస్కరాచారి, సతీష్‌రెడ్డి, గంటల వెంకటరామిరెడ్డి, బాదం వెంకటస్వామి, నరేందర్‌రెడ్డి, పుట్ట కురుమన్న, కొంటి సత్యం, మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఉపసర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, కొండ శివారెడ్డి, నవీన్‌రెడ్డి, తిరుపతయ్య, సయ్యద్ రఫీక్, రవి, నాయని బుగ్గపల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ ఎక్సైజ్ సీఐగా యమునాధర్‌రావు



ఆత్మకూర్: స్థానిక ఎక్సైజ్, ప్రొహిబీషన్‌శాఖ సీఐగా యమునాధర్ రావు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన శ్రావణ్‌కుమార్ కృష్ణ చెక్‌పోస్టుకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ ఏరియా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా బాధ్యతలు నిర్వర్తించిన యమునాధర్‌రావు బదిలీపై ఆత్మకూర్ సీఐగా విధుల్లో చేరారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని శాగాపూర్ సబ్‌సెంటర్‌ను సందర్శించి వ్యాధి నిరోధక టీకాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించేలా వైద్య సిబ్బంది తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు సరైన సమయంలో మొదటి, రెండో డోస్ టీటీ వ్యాక్సిన్ వేయించుకునేలా సిబ్బంది చూడాలన్నారు. దీంతో పాటు గ్రామాల్లో నిర్వహిస్తున్న మధుమేహ(షుగర్) పరీక్షలు 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ చేయించుకొని వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుమిత్ర, ఆశాలు పాల్గొన్నారు.

నేడు వీపనగండ్లలో మంత్రి జూపల్లి పర్యటన

వీపనగండ్ల: మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం భూమిపూజ చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, గోపి, యాదయ్య, కావలి మహేష్, అల్వారు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా మంజూరు అయిన నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ కాల్వల నిర్మాణాలు, కస్తూర్బా గాంధీ పాఠశాలలో అదనపు వసతుల కోసం నిర్మించనున్న పనులకు భూమిపూజతో పాటు ఇటీవలే కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు మంజూరయిన 108 వాహనాన్ని ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

ఛత్రపతి శివాజీ ఆశయాలు కొనసాగిద్దాం



ఖిల్లాఘనపురంలో ఛత్రపతి శివాజీ శోభాయాత్ర నిర్వహిస్తున్న యువత

సాక్షి, నెట్‌వర్క్: యువత ఛత్రపతి శివాజీ ఆశయాలను తప్పకుండా పాటించాలని వక్తలు అన్నారు. బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద యువత, హిందూ వాహిని, భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్, రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యువత కాషాయ జెండాలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

● ఆత్మకూర్‌లో సూర్యవంశ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి విగ్రహంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, అశ్విన్‌కుమార్, రవియాదవ్, నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

● అమరచింత పట్టణంలోని శివాజీనగర్‌లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చాకలి రవి, బంగారి కృష్ణ, సందీప్, రాజేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● ఖిల్లాఘనపురంలోని బెస్తగేరి ఆంజనేయస్వామి ఆలయం నుంచి బస్టాండు మీదుగా పెట్రోల్‌బంకు వరకు శివాజీ విగ్రహంతో పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యకమం చేపట్టారు. పర్వతాపురం గ్రామానికి చెందిన శివమాలధారులు పర్వతాపురం నుంచి ఖిల్లాఘపురం, రోడ్డుమీదితండా, అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, మామిడిమాడ గ్రామాల మీదుగా శోభయాత్ర నిర్వహించారు.

● కొత్తకోట పట్టణ సమీపంలో గల ఛత్రపతి శివాజీ విగ్రహానికి ఛత్రపతి శివాజీ వాకింగ్ క్లబ్, హిందూ వాహిని సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఛత్రపతి వాకింగ్ గ్రూప్ అధ్యక్షుడు స్టార్ అంజనేయులు, యాదయ్యసాగర్, రవి, కొండారెడ్డి, రవి, రాంచంద్రారెడ్డి, రాజుయాదవ్, యాదగిరి తదితరులు ఉన్నారు.



ఆత్మకూర్‌లో..



కొత్తకోటలో..



అమరచింతలో..

మెనూ ప్రకారం భోజనం అందించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీఓ సురేష్

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి, డీపీఓ సురేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహాన్ని బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. అనంతరం వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా స్టాక్‌రూంలో నిల్వ చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. నాణ్యత గల ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలని, విద్యార్థులు వారంలో 5 గుడ్లు, 6 అరటి పండ్లు, ఆదివారం చికెన్ తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. వసతి గృహ వార్డెన్ చంద్రన్ మాట్లాడుతూ అసంపూర్తిగా కంపౌండ్ ఉందని, తాగునీటి బోరు లేదని, స్వీపర్లు అవసరమని ప్రత్యేక అధికారికి విజ్ఞప్తి చేశారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐ

ఆత్మకూర్: అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు కేసులు నమోదు చేసినట్లు ఆత్మకూర్ ఎక్సైజ్, ప్రొహిబీషన్‌శాఖ సీఐ యమునాధర్‌రావు, ఎస్‌ఐ కృష్ణకాంత్ తెలిపారు. బుధవారం ఆత్మకూర్, అమరచింత మండలాల పరిధిలోని తుక్యానాయక్‌తండా, కొత్తతండాల్లో దాడులు నిర్వహించి 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న మూడు కల్లు దుకాణాలు సీజ్ చేసి, ఒకే దుకాణం నడిచేలా సొసైటీ నిర్వాహకులు చూసుకోవాలన్నారు. అక్రమ మద్యం, సారా, కల్తీ కల్లు విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి



భూమిపూజ చేస్తున్న అధికారులు

వీపనగండ్ల: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మప్ప, ఎంపీడీఓ శ్రీనివాసారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో అర్హత ఉన్నవారిని గుర్తించడం, ఇంటి నిర్మాణంలో ఖాళీ స్థలంతో పాటు నిర్మాణ ప్రారంభ ఫొటోలను కూడా ఆన్‌లైన్ ద్వార నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఇంటి నిర్మాణ దశలను గుర్తించి 4 విడుతల వారిగా రూ.5 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, నారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, బిచ్చన్న, రవీందర్‌రెడ్డి, గోపి, విష్ణు, వెంకటేష్, కావలి మహేష్, వెంకటరాజయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బూట్లు వితరణ



రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికలతో హెచ్‌ఎం, పీడీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కబడ్డీ క్రీడాకారుణిలకు పాఠశాలకు చెందిన జీహెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ శ్యామల తమ సొంత ఖర్చులతో రూ.3 వేలు విలువ చేసే 3 జతల బూట్లు (షూస్)ను వితరణగా బాలికలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 9వ తరగతి బాలికలు 34వ కబడ్డీ అసోసియేషన్ గేమ్స్‌లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైయ్యారని తెలిపారు. ఈనెల 20 తేదీ నుంచి 23వ తేదీ వరకు వికారాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలికలు జ్యోత్స్న, గాయత్రి, నందిని కి షూస్ లేని విషయం తమ దృష్టికి తీసుకరావడంతో స్పందించి వారికి షూస్‌ను అందజేసినట్లు పేర్కొన్నారు.

హరహర మహాదేవ.. శంభోశంకర



ఆత్మకూర్‌లోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఇరుముడి కట్టుకుంటున్న శివ దీక్షాపరులు

ఆత్మకూర్: పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి ఆలయాల వద్ద ప్రముఖ పూజారులు కరుణాకరయ్య, గిరిధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు హాజరైన భక్తులకు, శివ మాలధారులకు మాజీచైర్‌పర్సన్ గాయత్రి, బంగారు ప్రకాష్, బంగారు భాస్కర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. చెరువుకట్టపై చెర్ల పరమేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శివ మాలధారులు పాదయాత్రగా శ్రీశైలం మల్లన్న సన్నిధికి తరలివెళ్లారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో బుధవారం బంగారు గాజు, ఉంగరం పోగొట్టుకున్నట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి వస్తువులు రికవరీ చేశామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. పట్టణంలోని బజయ్య కాలనీకి చెందిన కంబాకారి విజయలక్ష్మి బుధవారం నాగర్‌కర్నూల్ వెళ్లడానికి వనపర్తి బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న క్రమంలో చేతికి ఉన్న బంగారు గాజు, ఉంగరం అదృశ్యమయ్యాయని ఫిర్యాదు చేశారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి కానిస్టేబుళ్లు కిషోర్, శ్రీను, అభిషేక్, రాజమోహన్ విచారణ ప్రారంభించారు. వారు బస్టాండ్‌లోని సీసీ పుటేజీ ఆధారంగా ఒక మహిళకు వస్తువులు దొరికాయని నిర్ధారించుకొని.. ఆమె ఎక్కిన బస్సు మెటర్నిటీ ఆస్పత్రి వద్ద వెళ్తుండగా, బస్సు ఆపి విచారణ చేశారు. ఆమె ద్వారా బంగారు గాజు, ఉంగరం స్వాధీనం చేసుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విజయలక్ష్మికి వస్తువులు అప్పగించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



రాములును అభినందిస్తున్న ఎంపీ డీకే అరుణ

వనపర్తి: జిల్లాలో కమలదళాన్ని బలోపేతం చేసేందుకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో తన అనుచర వర్గానికి పదవులు ఇప్పిస్తూ పార్టీ బలోపేతానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల నియామకాలు చేసిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా జిల్లాలోని ఆత్మకూర్ మండలం తిప్పడంపల్లికి చెందిన కంభాళాపురం రాముకు స్థానం కల్పించేలా కృషి చేశారు. ఆయన విద్యార్థి దశ నుంచే ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేయడంతో అధిష్టానం సైతం ఆయనకు రాష్ట్ర కౌన్సిల్‌లో చోటు కల్పించారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి డీకే అరుణ అనుచర వర్గంలో ముఖ్య నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాముకు పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



మామిడిమాడ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాన్‌గల్ మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలలో, మదనాపురం మండలంలోని దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖిల్లాఘనపురం మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలలో, పెద్దమందడి మండలంలోని వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, జగత్‌పల్లి ప్రాథమిక స్కూల్‌లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఫారూఖ్‌హుస్సేన్, హెచ్‌ఎంలు అనిల్‌కుమార్ చెన్నప్ప, ఆనంద్, కొన్నూరు పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సాయిలీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.